క్లుప్తంగా

కూటమిది.. కార్మిక వ్యతిరేక ప్రభుత్వం

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌లో క్షేత్రస్థాయిలో పనులు చేస్తున్న కార్మికులకు సమాన పనికి సమాన వేతనాలు ఇవ్వలేని కూటమి ప్రభుత్వం కార్మికుల హక్కులను హరిస్తోందని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జనరల్ సెక్రటరీ ఆసుల రంగనాయకులు ఓ ప్రకటనలో తెలిపారు. ఇటీవల మున్సిపల్ కార్మికులకు సకాలంలో సమాన వేతనాలు ఇవ్వాలని రాష్ట్ర హైకోర్టు ఆదేశించిందని, దీన్ని పలుమార్లు వీఎంసీ పట్టించుకుండా ఉండటంపై కోర్టు ఆగ్రహాన్ని వ్యక్తం చేసినప్పటికీ మున్సిపల్ శాఖ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందన్నారు. కార్మికులకు వేతనాలు చెల్లించకుండా జాప్యం చేస్తున్న వీఎంసీ–రాష్ట్ర మున్సిపల్ శాఖ కార్మికులకు వ్యతిరేకంగా పనిచేయటానికి వీఎంసీ ప్రజల నుంచి వసులు చేసిన పన్నులను రూ.లక్షలు ఖర్చుపెడుతుందని చెప్పారు. ఈ కేసుకు సంబంధించి కార్మికులకు వ్యతిరేకంగా కేవీయట్ పిటిషన్ వేయటం దారుణమన్నారు. ఇకనైనా వీఎంసీ అధికారులు కార్మిక సంక్షేమాన్ని చూడాలని లేని పక్షంలో తాము ప్రజా ఉద్యమాన్ని చేపడతామని హెచ్చరించారు.

అలరించిన హిందీ చిత్రగీతాలు



విజయవాడకల్చరల్: విఖ్యాత మ్యూజిక్ సంస్థ మయూరి ఆర్కెస్ట్రా ఆధ్వర్యంలో తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో హిందీ చిత్ర సంగీత దర్శకుడు ఆర్ బర్మన్ సంగీత సేవలు గుర్తు చేసుకుంటూ నిర్వహించిన హిందీ చిత్ర గీతాల కార్యక్రమం ఆద్యంతం మధురంగా సాగింది. మహ్మద్ ఖాజా ఆధ్వర్యంలో గాయనీ గాయకులు రసూల్ బాబు, శ్రీధర్, షహనాజ్, సత్య, సుధా శ్రీనివాస్, కీర్తన, ప్రఖ్య, డాక్టర్ భాగ్యశ్రీ ఆర్ బర్మన్ సంగీత దర్శకత్వం వహించిన చిత్ర గీతాలను ఆలపించారు. గాయకుడు ఖాజా మాట్లాడుతూ 1960లో ప్రారంభమైన ఆయన సినీ ప్రస్థానం 1990 దాకా సాగిందన్నారు. 300 పైగా చిత్రాలకు నృత్య దర్శకత్వం వహించారని తెలిపారు. గాయకులను నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాయకాపురం(విజయవాడరూరల్): పాయకాపురం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా సోమవారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.రవీంద్రబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాధానగర్, బర్మాకాలనీ, ప్రజాశక్తినగర్, సుందరయ్యనగర్, ఎస్‌జె కిడ్స్ స్కూల్ రోడ్, బిందెల కంపెనీ రోడ్డు తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామన్నారు.

వాంబేకాలనీలో..

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): అజిత్‌సింగ్‌నగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని వార్షిక తనిఖీలు, మరమ్మతుల నేపథ్యంలో 60వ డివిజన్ వాంబేకాలనీలో సోమవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఈఈ పి.రవీంద్రబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వాంబేకాలనీలో ఏ నుంచి జి వరకూ ఉన్న అపార్ట్‌మెంట్స్, జేఎన్‌ఎన్యూఆర్‌ఎం అపార్ట్‌మెంట్స్, డిస్నీల్యాండ్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

నేడు ప్రజా ఫిర్యాదులు - పరిష్కార కార్యక్రమం

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరపాలకసంస్థ కల్పిస్తున్న మౌలిక వసతుల్లో తలెత్తే సమస్యల పరిష్కారానికి ప్రతి సోమవారం ప్రజా ఫిర్యాదులు – పరిష్కారం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని వీఎంసీ ప్రధాన కార్యాలయంతో పాటు చిట్టినగర్‌లోని సర్కిల్–1, సత్యనారాయణపురంలోని సర్కిల్–2, పటమటలోని సర్కిల్–3 కార్యాలయాల్లో జోనల్ కమిషనర్లు ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తారన్నారు. ఈ కార్యక్రమం సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాన్ని నగర వాసులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

దొంగతనాలు, సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాలి



మధురానగర్(విజయవాడసెంట్రల్): సైబర్ నేరాలు, దొంగతనాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గుణదల పీఎస్ ఎస్ఐ ధర్మరాజు సూచించారు. పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర బాబు ఆదేశాల మేరకు ఆదివారం సాయంత్రం గుణదల పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రశాంత్ కాలనీలో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సైబర్ నేరాలు ఎలా జరుగుతున్నాయి, నేరాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన వివరించారు. పోలీస్ కమిషనర్ ప్రవేశపెట్టిన ఈ పహారా, డయల్ 100, 112, ఎల్‌హెచ్ఎంఎస్ యాప్ వలన కలిగే ఉపయోగాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వార్డు సచివాలయం కార్యదర్శి, పోలీసులు, స్థానికులు పాల్గొన్నారు.

రజకుల కల్యాణ మండపాన్ని అందుబాటులోకి తెండి !

- పనులు పూర్తయినా వినియోగంలోకి రాని దుస్థితి
- రూ.56.85 లక్షలతో కల్యాణ మండపం నిర్మాణం
- గత ప్రభుత్వ హయాంలోనే 95 శాతం పనుల పూర్తి



దుర్గాపురంలో పనులు పూర్తయిన చిట్యాల ఐలమ్మ సామాజిక భవనం

మధురానగర్(విజయవాడసెంట్రల్): 27వ డివిజన్ దుర్గాపురంలో రూ.56.85 లక్షలతో నిర్మించిన చిట్యాల ఐలమ్మ సామాజిక భవనం(రజకుల కల్యాణ మండపం) నేటికీ వినియోగంలోకి రాలేదు. పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలు అధికంగా నివసించే దుర్గాపురంలో రజక కల్యాణ మండపం నిర్మించాలని దశాబ్దాలుగా రజకులు కోరుతున్నారు. ప్రభుత్వాలు మారినా రజకుల కల మాత్రం నెరవేరలేదు. ఏ చిన్న శుభ కార్యం చేసుకోవాలన్నా దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన దుస్థితి ఉండేది. అలాగే అధిక మొత్తంలో కల్యాణ మండపాలకు చెల్లించాల్సి రావటంతో వ్యయప్రయాసలకు ఓర్చి శుభకార్యాలు నిర్వహించుకుంటున్నారు.

మిగిలిన పనులు పూర్తి చేయాలి..

స్థానికుల విజ్ఞప్తి మేరకు రజకుల దశాబ్దాల చిరకాల వాంఛగా ఉన్న రజకుల కల్యాణ మండపాన్ని పూర్తి చేస్తామని మల్లాది విష్ణు ఎన్నికలలో హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీ మేరకు దుర్గాపురం సాంబమూర్తి రోడ్డులో చిట్యాల ఐలమ్మ సామాజిక భవనం పేరిట రజకుల కల్యాణ మండపం నిర్మించేందుకు అప్పటి ఎమ్మెల్యే మల్లాది విష్ణు రూ.56.85 లక్షలు నిధులు మంజూరు చేయించారు. స్థానిక కార్పొరేటర్ కొండాయగుంట మల్లీశ్వరితో కలిసి కల్యాణ మండపం నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. పనులు శరవేగంగా నిర్వహించి గత ప్రభుత్వ హయాంలోనే 95 శాతానికి పైగా కల్యాణ మండపం పనులు పూర్తి చేశారు. ప్రజలకు త్వరితగతిన వినియోగంలోకి తీసుకువచ్చేందుకు రజక నాయకులు, స్థానికుల విజ్ఞప్తి మేరకు కల్యాణ మండపాన్ని మల్లాది విష్ణు ప్రారంభించారు. మిగిలిన కొద్దిపాటి చిన్న పనులు పూర్తిచేసి వినియోగంలోకి తీసుకువస్తామని హామీ ఇచ్చారు.

నగర పాలక సంస్థకు ఆదాయం..

ఇంతలో ఎన్నికలు రావటం ప్రభుత్వం మారటంతో పనులు పూర్తయ్యి సుమారు ఏడు నెలలు దాటినప్పటికీ నేటికీ ప్రజలకు అందుబాటులోకి రాలేదు. అన్ని వసతులతో కల్యాణ మండపం ఉన్నప్పటికీ శుభకార్యాలు చేసుకోవటానికి దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుందని స్థానికులు విచారం వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ కల్యాణ మండపాన్ని వినియోగంలోకి తీసుకురావటం వల్ల ప్రజలకు సౌకర్యవంతంగా ఉండటంతో పాటు నగరపాలకసంస్థకు ఆదాయం కూడా లభించే అవకాశం ఉంది. అధికారులు స్పందించి రజకుల చిరకాల వాంఛగా ఉన్న కల్యాణ మండపాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

మధురానగర్‌లో ద్విచక్రవాహనం బీభత్సం



దెబ్బతిన్న ద్విచక్ర వాహనం

మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్‌లో శనివారం రాత్రి ద్విచక్ర వాహనం బీభత్సం సృష్టించింది. వివరాల్లోకి వెళితే శనివారం రాత్రి 7 గంటల ప్రాంతంలో రెండు ద్విచక్ర వాహనాలపై ఇద్దరు యువకులు మితిమీరిన వేగంతో మధురానగర్ రైల్వేగేట్ సమీపంలో బైక్ విన్యాసాలు చేస్తూ పార్కింగ్ చేసిన గ్యాస్ లారీను ఒక స్కూటర్ బలంగా ఢీ కొట్టారు. ఈ క్రమంలో తీవ్రంగా గాయపడిన యువకుడిని స్థానికులు ఆస్పత్రికి తరలించారు. నిత్యం రద్దీగా ఉండే ఈ మార్గంలో బైక్‌లతో స్టంట్స్, స్కూటర్‌పై విన్యాసాలు తరచూ చేస్తూ స్థానికులను భయాందోళనలకు గురి చేస్తున్నారు. ఇక్కడ రైల్వే ట్రాక్ పక్కన ఆకతాయిలకు అనువుగా ఉండటం వల్ల కూడా ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన యువకులు మద్యం, గంజాయి మత్తులో ఆగడాలకు పాల్పడుతున్నారు. అధికారులు ఈ విషయమై తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

అంకమ్మతల్లికి ప్రత్యేక పూజలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ నేతాజీ కాలనీ శ్రీ అంకమ్మతల్లి శక్తిపీఠంలో ఆదివారం ప్రత్యేక పూజలు, అర్చనలు జరిగాయి. పీఠం వ్యవస్థాపకుడు అన్నాబత్తుల శరాబందీరావు అమ్మవారికి ప్రీతికరమైన కుంకుమార్చనలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు, స్వాములు పాల్గొని పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

దివ్యాంగునికి చేయూత



మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడుకు చెందిన హెల్పింగ్ టు గెదర్ 2009 గ్రూప్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు ఆదివారం దివ్యాంగునికి రూ.10 వేలు విలువ చేసే సెల్‌ఫోన్ రిపేర్ మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యులు షఫీవుల్లా, నాగమల్లిక మాట్లాడుతూ.. దివ్యాంగుడైన బాలు సెల్‌ఫోన్ మెకానిక్‌గా పనిచేస్తున్నారన్నారు. బాలు ఆర్థిక పరిస్థితి బాగాలేకపోవటంతో పాటు అవసరమైన సెల్‌ఫోన్ రిపేర్ మెటీరియల్ లేక ఇబ్బంది పడుతున్నారన్నారు. దీంతో ట్రస్ట్ సభ్యుల సహకారంతో సెల్‌ఫోన్ రిపేర్ మెటీరియల్ అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు భూస్వామి, హిరణ్య, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వాకర్స్ సేవలు విస్తృతం చేయాలి



మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రజల అవసరాలను గుర్తించి వాటి మేరకు సేవలు అందించాలని వాకర్స్ క్లబ్ జిల్లా గవర్నర్ డాక్టర్ చిన్నం రామకృష్ణ సూచించారు. స్థానిక దుర్గాపురం గులాబీతోటలో ఆదివారం శ్రీ అమరావతి వాకర్స్ క్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని నూతన కార్యవర్గం చేత ప్రమాణ స్వీకారం చేయించారు. క్లబ్ అధ్యక్షుడిగా బండారు వెంకటేశ్వరరావు, కార్యదర్శిగా రాజనాల లక్ష్మి శ్రీనివాస్, కోశాధికారి ఎస్‌కే రషీద్, పి.రవి. ఉపాధ్యక్షుడు కె.శ్రీనివాస్ తదితరులచేత ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో వాకర్స్ పాస్ట్ గవర్నర్ రావి కృష్ణారావు, కోశాధికారి జి.వి.మురళీకృష్ణ, డెప్యూటీ గవర్నర్‌లు డాక్టర్ బ్రహ్మ దేశం వసంత కుమార్, ఇమ్మానేని కృష్ణప్రసాద్, ఎన్‌జీబీ ప్రసాద్, రీజినల్ కార్యదర్శి కొండాయగుంట రాము, గుర్రం ఏడుకొండలు, బి.ఆంజనేయరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా దీపాల తయారీ పోటీలు



దీపాలు తయారు చేసిన విద్యార్థులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బందరు రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో దీపావళి పండుగను పురస్కరించుకుని విద్యార్థులకు దియా మేకింగ్(దీపాల తయారీ) పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో నగరంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొని తమలోని సృజనాత్మకతతో సరికొత్త దీపాలను తయారు చేశారు. వాటిని అందంగా అలంకరించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు గ్రంథాలయ అధికారి కే రమాదేవి బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు కళలలోనూ రాణించాలన్నారు. విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీయాలనే ఉద్దేశంతోనే ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

వరద బాధితులకు కిట్ల పంపిణీ



వరద బాధితులకు సామగ్రి అందజేస్తున్న న్యాయవాదులు

విజయవాడస్పోర్ట్స్: బుడమేరు వరద బాధితులకు బెజవాడ బార్ అసోసియేషన్(బీబీఏ), ఏలూరు, విజయవాడ ఫ్లాష్ టీమ్, రాధా రంగ మిత్రమండలి సభ్యులు దుప్పట్లు, గోడ గడియారం కిట్‌లను పంపిణీ చేశారు. విజయవాడ సివిల్ కోర్టుల ప్రాంగణంలో బీబీఏ కార్యదర్శి అరిగల శివరామప్రసాద్(రాజా), మాజీ అధ్యక్షుడు వి.గురునాథం, సిటీ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు నరహరిశెట్టి నరసింహారావు 200 మంది బాధితులకు ఈ కిట్‌లను ఆదివారం అందజేశారు. న్యాయవాది యర్రంశెట్టి శ్రీనివాసరావు సౌజన్యంతో సింగ్‌నగర్, పాయకాపురం, రాజీవ్‌నగర్, కండ్రిక తదితర ప్రాంతాల్లోని బాధితులకు ఈ కిట్‌లను అందించారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు పడవల ఏడుకొండలు, పీడీఎస్ నారాయణ, మల్లి, కిరణ్, మేకల వెంకటేశ్వరరావు, వేముల శ్రీనివాస్, నామాల కోటేశ్వరరావు, ఏలూరు 23వ డివిజన్ కార్పొరేటర్ సాంబ పాల్గొన్నారు.

సీవీఆర్ స్కూల్‌లో నిత్యావసరాల అందజేత

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బుడమేరు వరద బాధితులకు ఫినోలెక్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్, ముకుల్ మాధవ్ ఫౌండేషన్ సహాయం అందించింది. బాధితులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. గవర్నర్‌పేట సీవీఆర్ స్కూల్‌లో ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు చేతుల మీదుగా బాధితులకు ఆదివారం కిట్లు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ ఫ్లోర్‌లీడర్ నెలిబండ్ల బాలస్వామి, ఫౌండేషన్ ప్రతినిధులు శ్రీహరి, గణేష్, డివిజన్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

విశ్వ ఆయుర్వేద పరిషత్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జాతీయ ఆయుర్వేద దినోత్సవాన్ని పురస్కరించుకొని విశ్వ ఆయుర్వేద పరిషత్ విజయవాడ విభాగం ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఆయుర్వేద అవగాహన సదస్సు, ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. తొలుత ధన్వంతరి చిత్రపటానికి వైద్యులు పూలమాలలు వేసి శిబిరాన్ని ప్రారంభించారు. ఈ శిబిరంలో 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విశ్వ ఆయుర్వేద పరిషత్ జనరల్ సెక్రటరీ డాక్టర్ నల్లు ధరణి కుమార్ మాట్లాడుతూ.. ఆయుర్వేదం విశిష్టత, ప్రస్తుత కాలంలో ఆయుర్వేదం అభివృద్ధి, దాని ఉపయోగాలను వివరించారు. ఆయుర్వేద పద్ధతులైన శమన, శోధన చికిత్సల ద్వారా ఎటువంటి రోగాలైన సైడ్ ఎఫెక్ట్ లేకుండా నయం చేయవచ్చన్నారు. డాక్టర్ సాహితీ మాట్లాడుతూ.. ప్రతి ఏటా ధన్వంతరి జయంతిని జాతీయ ఆయుర్వేద దినోత్సవంగా కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తోందని చెప్పారు. ప్రజలు ఆయుర్వేదంపై ఉన్న అపోహలు వీడాలన్నారు. శిబిరంలో వైద్యులు ప్రశాంత్, రాఘవ, వాకర్స్ క్లబ్ విజయవాడ అధ్యక్షుడు మోటూరి ప్రభాకర్, సభ్యులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గ్యార్మీ వేడుక



గ్యార్మీ వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు

పాయకాపురం(విజయవాడరూరల్): ఐకమత్యానికి నిదర్శనం గ్యార్మీ వేడుకలు అని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. వాంబే కాలనీలో గ్యార్మీ వేడుకను ఆదివారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి మల్లాది విష్ణు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రతి ఏటా గ్యార్మీ పండుగను ముస్లింలు ఎంతో సంతోషంగా, భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారని విష్ణు పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ మహమ్మద్ ప్రవక్త సూచించిన మార్గంలో నడుచుకోవాలని, ఇతరుల పట్ల ప్రేమాభిమానాలు కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, పెద్ద సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్యంపై నేడు అవగాహన సదస్సు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): ధన్వంతరీ జయంతిని సందర్భంగా సోమవారం ఉదయం 11.30 గంటలకు మొగల్రాజపురం రావిచెట్టు సెంటర్‌లో ఉన్న తమ కార్యాలయం ఆవరణలో ఆయుర్వేద వైద్యంపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు జనశిక్షణ సంస్థాన్ డైరెక్టర్ ఏ.పూర్ణిమ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయుర్వేద వైద్యులు ఎస్.సాహితి, కె.పూర్ణరాజేశ్వరి, సత్యప్రశాంత్, ఎస్.ధరణి కుమార్ పాల్గొని అవగాహన కల్పిస్తారన్నారు. ఆసక్తి ఉన్నవారు ఈ సదస్సుకు హాజరు కావాలని సూచించారు.

శృతిలయ సమ్మేళనం.. సంగీతోత్సవం



విజయవాడకల్చరల్: దృశ్య వేదిక నెల వారీ కార్యక్రమంలో భాగంగా గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించిన సంగీత కచేరి ఆకట్టుకుంది. వీణాధరి సంగీత సంగీత విద్యాలయం నిర్వాహకురాలు నందిని శ్రీనివాస్ పర్యవేక్షణలో ఎస్.నిఖిల ప్రియ, బి.కృష్ణకుమారి, ఎస్.తరుణి, జి.రాజేశ్వరి, సంగీత మూర్తి త్రయం త్యాగరాజ స్వామి, ముత్తు స్వామి దీక్షితార్, శ్యామశాస్త్రిల కీర్తనలను వీణపై మధురంగా పలికించారు. మృదంగంపై విశ్వనాథ శరవణ, తాళంపై సీతా వైష్ణవి సహకరించారు. రంగస్థల కార్యక్రమంలో భాగంగా బలిజేపల్లి లక్ష్మీకాంత కవి రచించిన సత్యహరిశ్చంద్ర నాటకంలోని అడవి సన్నివేశాన్ని కళాకారులు నటించి రక్తి కట్టించారు. హరిశ్చందునిగా బుర్రా నరేస్, చంద్రమతిగా లక్ష్మీశ్రీ, నక్షత్రకునిగా పరదేశి, లోహితాస్యునిగా ఆరాధ్య నటించారు. ఈవన రమేష్ బాబు, కత్తి శ్యాంప్రసాద్, భాగ్యరాజు పాల్గొన్నారు. కళాకారులను నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు.

నేటి నుంచి ఎన్‌ఆర్‌ఐ, ఎయిమ్స్‌కు సిటీ బస్సులు



మధురానగర్(విజయవాడసెంట్రల్): వేగంగా అభివృద్ధి చెందుతున్న జీవీఆర్ నగర్, దావు బుచ్చయ్యకాలనీ, వినాయకనగర్ తదితర ప్రాంతాలకు కనెక్టివిటీ పెరుగుతుంది. పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలు అధికంగా నివసించే ఇక్కడ నుంచి బయటకు ప్రాంతాలకు వెళ్లాలంటే ఆటో, ప్రైవేటు రవాణా సదుపాయాలను ఆశ్రయించాల్సి వచ్చేది. దీంతో అధిక వ్యయంతో పాటు విలువైన సమయం వృథా అయ్యేది. ముఖ్యంగా ఇక్కడ నుంచి రైల్వేస్టేషన్, మంగళగిరి ఎయిమ్స్‌కు వెళ్లేందుకు ప్రజలు అనేక అవస్థలు పడుతుండే వారు. గత ప్రభుత్వ హయాంలో కోట్లాది రూపాయల వ్యయంతో ఈ ప్రాంతాల్లో రోడ్డు పనులు పూర్తిచేశారు. అలాగే మెయిన్ రోడ్డును సైతం విస్తరించి సువిశాలంగా కొత్త రోడ్డు వేశారు. దీంతో ఈ ప్రాంతం నుంచి రైల్వేస్టేషన్, మంగళగిరి ఎయిమ్స్‌కు సిటీ బస్సులు వేయాలంటూ డాక్టర్ బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు బి.వసంతకుమార్, స్థానికులు పలుమార్లు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఆర్టీసీ అధికారులు ఈ ప్రాంతాలను పరిశీలించి ఇక్కడ నుంచి సిటీ బస్సును నడిపేందుకు అంగీకరించారు. దీనిపై జీవీఆర్‌నగర్, దావు బుచ్చయ్యకాలనీ, వినాయకనగర్, దేవీనగర్, మధురానగర్, దుర్గాపురం వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నేటి నుంచి సర్వీసులు..

సోమవారం నుంచి 14, 14ఏ, 14 ఎస్ నంబర్‌లతో ఉదయం 7.15, 9.45, మధ్యాహ్నం 3.35 గంటలకు దేవీనగర్ నుంచి బస్సు సర్వీసులు ప్రారంభమవుతాయి. ఈ సర్వీసులు మధురానగర్ జంక్షన్, గులాబీతోట, డీమార్ట్, రైల్వేస్టేషన్, పీఎన్‌బీఎస్ వారధి, ఎయిమ్స్, మంగళగిరి ఎన్‌ఆర్‌ఐకు చేరుకుంటాయి. అలాగే ఎన్‌ఆర్‌ఐ నుంచి ఉదయం 6.10, 8.40, మధ్యాహ్నం 2.30, సాయంత్రం 5.05 గంటలకు సిటీ సర్వీసులు ప్రారంభం అవుతాయి.

ఆర్టీసీ అధికారులకు కృతజ్ఞతలు



మేము గత కొంత కాలంగా మంగళగిరి ఎయిమ్స్‌కు సిటీ బస్సు సర్వీసులు నడపాలని కోరుతున్నాం. ఇప్పటికే మేం అడిగిన రూట్‌ను పరిశీలించి ఓకే చెప్పారు. సోమవారం నుంచి సిటీ బస్సులు ప్రారంభమవుతాయి. ఈ బస్సుల వల్ల దుర్గాపురానికి సిటీ బస్సు సౌకర్యం కలగటంతో పాటు పేద, మధ్య తరగత వర్గాల ప్రజలు ఎయిమ్స్, ఎన్‌ఆర్‌ఐ ఆసుపత్రులకు సులభంగా చేరుకోగలుగుతారు. ప్రజలకు ఈ బస్సుల గురించి తెలియ చేసేందుకు సొసైటీ ద్వారా అవగాహన కల్పిస్తాం. స్పందించిన ఆర్టీసీ అధికారులకు కృతజ్ఞతలు.

– బి.వసంతకుమార్, డాక్టర్ బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు

సమాజ పురోభివృద్ధిలో సాహిత్య సంస్థలు పునరంకితం కావాలి



అమరావతి ఫౌండేషన్ లోగో ఆవిష్కరిస్తున్న హరికృష్ణ, గోళ్ల నారాయణరావు, విజయలక్ష్మి

విజయవాడకల్చరల్: సమాజ పురోభివృద్ధిలో సాహిత్య కళా సంస్థలు పునరంకితం కావాలని జానపద అకాడమీ తొలి అధ్యక్షుడు పొట్లూరి హరికృష్ణ సూచించారు. లేపాక్షి ఫౌండేషన్ ఆవిర్భావ సభను విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ హాల్‌లో ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న హరికృష్ణ మాట్లాడుతూ.. రాయలసీమలోని వెనకబడిన ప్రాంతానికి చెందిన నలుగురు యువకులు సాహిత్యం, సమాజ హితం కోసం లేపాక్షి సంస్థను స్థాపించారని తెలిపారు. సమకాలీన సాహిత్యం సామాన్యులకు చేరుకోవాలనే వారి ఆశయం సంకల్పం సఫలం కావాలని కోరారు. పోలవరపు కోటేశ్వరరావు సాహితీ పీఠం వ్యవస్థాపకుడు గోళ్ల నారాయణరావు మాట్లాడుతూ.. కవులు రచయితల సమాజాన్ని అధ్యయనం చేయాలని సూచించారు. అమరావతి ఫౌండేషన్ అధ్యక్షురాలు మద్దుల విజయలక్ష్మి నిర్వాహకులకు సాహిత్య కార్యక్రమ నిర్వహణపై దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో లేపాక్షి ఫౌండేషన్ నిర్వాహకులు వడ్డి సుధాకర్, డి.శ్రీనివాసులు, చిన్నారి అనిల్, అశోక్ పాల్గొన్నారు. వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన కవులు స్వీయ కవితా గానం చేశారు. సంస్థ లోగోను అతిథులు ఆవిష్కరించారు.

రొమ్ము క్యాన్సర్‌పై అవగాహనకు పింక్ ర్యాలీ



ఎంజీ రోడ్డులో పింక్ ర్యాలీ నిర్వహిస్తున్న నిర్వాహకులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): బ్రెస్ట్ క్యాన్సర్ అవగాహన మాసాన్ని పురస్కరించుకుని నగరంలోని ఆదివారం పింక్ రిబ్బన్ ర్యాలీ నిర్వహించారు. రూట్స్ హెల్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎంజీ రోడ్డులో ఎన్టీఆర్ సర్కిల్ నుంచి బెంజిసర్కిల్ వరకూ ఈ ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా రూట్స్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ పి.విజయభాస్కర్ మాట్లాడుతూ పింక్ కలర్ కాన్సెప్ట్‌తో రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తున్నామన్నారు. రొమ్ము క్యాన్సర్‌ను తొలిదశలో గుర్తించడం ముఖ్యమని, నిర్ధారణ పరీక్షలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని సూచించారు. రూట్స్ మహిళా కన్వీనర్ కె.మాధవి మాట్లాడుతూ ప్రతి మహిళ యుక్త వయస్సు నుంచే రొమ్ము స్వయం పరీక్ష విధానం తెలుసుకోవాలని సూచించారు. పింక్ బెలూన్స్ ధరించి రొమ్ము క్యాన్సర్ గురించి తెలియ చేసే కరపత్రాలు, పింక్ బెలూన్స్ అందచేసి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రూట్స్ సభ్యులు చందు శ్రీనివాస్, యలమందయ్య, మహాదేవ్, తారకలక్ష్మి, సావిత్ర తదితరులు పాల్గొన్నారు.

కృష్ణమాచార్యుల సంగీత సేవలు వెలకట్టలేనివి



రాఘవాచారికి పురస్కారం అందజేస్తున్న యల్లా, వెంకటేశ్వర్లు, గౌరీనాథ్ తదితరులు

విజయవాడకల్చరల్: సంగీత శేఖర శ్రీమాన్ నల్లాన్ చక్రవర్తుల కృష్ణమాచార్యుల సంగీత సేవలు వెలకట్టలేనివని పద్మశ్రీ పురస్కార గ్రహీత మృదంగ విద్వాంసుడు డాక్టర్ యల్లా వెంకటేశ్వరరావు అన్నారు. కృష్ణమాచార్య కళాపీఠం ఆధ్వర్యంలో కృష్ణమాచార్యులు శత జయంతి ఉత్సవాల సందర్భంగా ఐదు రోజులుగా శివరామ కృష్ణ క్షేత్రంలో నిర్వహిస్తున్న సంగీత ఉత్సవాలు ఆదివారం ముగిశాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న యల్లా మాట్లాడుతూ.. సంప్రదాయ సంగీత కుటుంబానికి చెందిన కృష్ణమాచార్యులు బహుభాషా కోవిదుడని గుర్తుచేశారు. ఆయన ఎందరో కళాకారులను సంగీత విద్వాంసులుగా తీర్చిదిద్దారన్నారు.

అలరించిన సంప్రదాయ కీర్తనలు..

ఆకాశవాణి విజయవాడ కేంద్రం సంచాలకుడు బి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. కృష్ణమాచార్య కళాపీఠం సంగీత రంగంలో విశేషమైన కృషి చేసిన వారికి స్ఫూర్తి పురస్కారం ప్రదానం చేసినట్లు తెలిపారు. విజయవాడ ఆకాశవాణి కేంద్రానికి సుదీర్ఘకాలం సేవలను అందించినట్లు గుర్తు చేశారు.. 2024 సంవత్సరానికి గాత్ర విద్వాంసులు హైదరాబాద్ సోదరుల్లో ఒకరైన డి.రాఘవాచారికి కృష్ణమాచార్యులు స్ఫూర్తి పురస్కారం ప్రదానం చేశారు. ఉదయం ప్రారంభమైన సంగీత సేవలో అనఘ, హరిద్ర, శాంతిశ్రీ, రామలక్ష్మి బృందం, చిన ముక్తేవి సంజన, టీకేవీ రామానుజా చార్యులు, పద్మావతి తదితరులు భక్తిగా సంప్రదాయ కీర్తనలను ఆలపించారు. కేవీపీ శాస్త్రి, కేఎప్ గోవిందరాజన్, విష్ణుభొట్ల సోదరీ మణులు, గాయత్రి గౌరీనాథ్ పాల్గొన్నారు. సంగీత కళాకారులు పోపూరి గౌరీనాథ్ నిర్వహించారు.

బ్రహ్మదేశం మాధవ్‌కు డాక్టరేట్



మధురానగర్(విజయవాడ సెంట్రల్): డాక్టర్ బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ, బీఆర్డీఎస్ వాకర్స్ క్లబ్ సభ్యులు బ్రహ్మదేశం మాధవ్‌కు అనంతపురం జేఎన్‌టీయూ డాక్టరేట్ ప్రదానం చేసింది. మాధవ్ కంప్యుటేషన్ ఎఫిషియెంట్ వీడియో ఫ్రేమ్ ఇంటర్‌పొలేషన్ అనే అంశంపై చేసిన పరిశోధనలకు డాక్టరేట్ అందుకున్నారు. ఈ సందర్భంగా బీఆర్డీఎస్ వాకర్స్ క్లబ్ డెప్యూటీ గవర్నర్ డాక్టర్ బ్రహ్మదేశం వసంతకుమార్, వాకర్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి కొండాయగుంట రాము, కోశాధికారి గుర్రం ఏడు కొండలు మాధవ్‌ను అభినందించారు.